డ్రగ్స్ నిర్మూలనకు కృషిచేద్దాం

- ప్రజా నాట్య మండలి ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలన పై విద్యార్థులకు అవగాహన
- సమాజాన్ని మేల్కొల్పుదామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ పిలుపు



కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బోయిన్‌పల్లి యాదవ సంఘం సభ్యులు

మారేడ్‌పల్లి, ఆగస్టు 23: డ్రగ్స్‌ను నిర్మూలించి.. సమాజాన్ని మేల్కొల్పుదామని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని మునగా రామమోహనరావు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ హాజరై మాట్లాడారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. ముఖ్యంగా మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్ చాలా అవసరమని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదవి భవిష్యత్‌లో తగిన గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. అదే విధంగా కాలేజీ బిల్డింగ్ మర్మతులకు అవసరమైన నిధులు మంజూరు చేస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా యూనిఫాంలు కావాలని విద్యార్థులు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే రెండు, మూడు రోజుల్లో విద్యార్థులందరికీ యూనిఫాంలు అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సినీ నటుడు కోటేశ్వరరావు, ప్రజానాట్య మండలి సభ్యులు మారన్న, సునీత, కళ్యాణ్, వసీం, కళాశాల ఉపాధ్యాయులు ముజాహిద్ అలీ, తిరుపతయ్య, శంకర్‌రెడ్డి, వినయ్, అశోక్, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

బొల్లారం, ఆగస్టు 23: అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా కృషి చేస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. శుక్రవారం ఒకటో వార్డు పరిధిలోని బోయిన్‌పల్లి యాదవ్ వెల్ఫేర్ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సభ్యులు కమ్యూనిటీ భవనానికి అదనపు స్లాబ్ నిర్మాణం, బోర్‌వెల్ మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే నిధులు కేటాయించి నిర్మాణ పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, ముప్పిడి మధుకర్, మల్లేశ్‌యాదవ్, వెంకటేశ్‌యాదవ్, రాజుయాదవ్, ఓంప్రకాశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంసీఏ రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్) కోర్సుతో పాటు దూరవిద్య ద్వారా అందించే ఎంసీఏ కోర్సు పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 23: ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. కోర్సు నాలుగో సెమిస్టర్ మెయిన్, మూడో సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షలను ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను www.osmania. ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బేగంపేట్, ఆగస్టు 23: విద్యుత్‌లైన్‌లలో తలెత్తిన సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్ నేపథ్యంలో నేడు బేగంపేట్ పాటిగడ్డ, బన్సీలాల్‌పేట్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ విద్యుత్ శాఖ ఏడీఈ అధికారులు శుక్రవారం తెలిపారు. పాటిగడ్డ సబ్‌స్టేషన్ రాణిగంజ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు నల్లగుట్ట స్కూల్ ఏరియా, పోచమ్మ దేవాలయం, మొగల్ కాస్ట్‌లే ఏరియా విద్యుత్ నిలిపివేస్తారు. అలాగే బన్సీలాల్‌పేట్ సబ్‌స్టేషన్ నాగన్నకుంట ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హనుమాన్ టెంపుల్, నాగన్నకుంట ఏరియాలో విద్యుత్ నిలిపివేస్తారు.

ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం

అడ్డగుట్ట, ఆగస్టు 23: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు, కళాకారులకు తప్పకుండా న్యాయం చేస్తుందని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. అందుకు ఉద్యమకారులందరూ ఒకే జేఏసీగా ఏర్పడాలని కోరారు. నాంపల్లిలోని తెలంగాణ జనసమితి కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల సమితి, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు. ఉద్యమకారుల సమితి చైర్మన్ ఎస్. యాదగిరి, ప్రతినిధులు తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి, బత్తుల సోమన్న, వెంకటస్వామి, చంద్రన్నప్రసాద్, చంద్రుడు, స్వామి, స్వరూప, అరుణ, సునీత, అంజలి, అంజయ్య, శ్రీనివాస్, శంకర్రావు, తుల్జారెడ్డి పాల్గొన్నారు.

ప్యారడైజ్ సెల్లార్‌లో అగ్ని ప్రమాదం

బేగంపేట్, ఆగస్టు 23: సికింద్రాబాద్ ప్యారడైజ్ హోటల్‌లో శుక్రవారం స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్‌తో హోటల్ సెల్లార్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిత్యం భోజన ప్రియులతో రద్దీగా ఉండే హోటల్ కావడంతో మంటల వ్యాపిస్తున్నాయని తెలిసి సందర్శకులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే హోటల్ నుంచి బయటకు పరుగులు తీశారు. హోటల్ బిల్డింగ్ సెల్లార్‌లో ఉన్న జనరేటర్ నుంచి మంటలు రావడంతో సిబ్బంది పోలీసులకు, అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. సమీపంలోనే అగ్ని మాపక కేంద్రం ఉండటంతో 5 నిమిషాల్లో ఘటనా స్థలికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లక పోవడంతో హోటల్ నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. షార్ట్ సర్క్యూట్‌తో జనరేటర్‌లో మంటలు చెలరేగినట్టు ప్రాథమిక విచారణలో తేలింది.

ప్యారడైజ్ హోటల్ భవనం సెల్లార్‌లో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

డిప్యూటీ మేయర్‌ను కలిసిన జీహెచ్ఎంసీ ఏఈ

డిప్యూటీ మేయర్ శ్రీలతకు మొక్కను అందజేస్తున్న ఏఈ వేణు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 23: నూతనంగా సికింద్రాబాద్ సర్కిల్ తార్నాక డివిజన్ ఏఈగా పదవీ బాధ్యతలు చేపట్టిన వేణు నగర డిప్యూటీ మేయర్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంపు కార్యాలయానికి వచ్చిన వేణు డిప్యూటీ మేయర్‌కు మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోండి



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

సికింద్రాబాద్, ఆగస్టు 23: నగరంలో చాపకింద నీరు లాగా డెంగ్యూ, మలేరియా వ్యాధులు విజృంభిస్తున్నా అరికట్టడంలో జీహెచ్ఎంసీ విఫలమైందని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. వ్యాధులకు కారణమైన దోమల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం సికింద్రాబాద్ జోన్ ఎంటమాలజిస్ట్ దుర్గాప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ సికింద్రాబాద్ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, నాయకులు గౌరీ నాగరాజ్, శ్రీహరి, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో ఘనంగా ఉర్సు ఉత్సవాలు

బోయిన్‌పల్లి కడక్‌పురా బస్తీలో ఈ షరీఫ్ దర్గా హజరత్‌లో ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మిస్కీన్ షాహబ్, హసీన్ ఖాన్, సమీర్, రిజ్వాన్, ఫరాజ్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

– బొల్లారం

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

దుర్గయ్య గార్డెన్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న రామకృష్ణ

మారేడ్‌పల్లి, ఆగస్టు 23: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. శుక్రవారం బస్తీబాటలో భాగంగా ఐదో వార్డు దుర్గయ్యగార్డెన్‌లో పర్యాటించారు. స్థానికంగా కొనసాగుతున్న వాటర్ పైప్‌లైన్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బస్తీబాట కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి దశలవారిగా వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐదో వార్డు బీజేపీ అధ్యక్షుడు విజయ్, సోమశేఖర్, మహేశ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం

నామాలగుండు బీఎన్ఆర్ గార్డెన్‌లో సమావేశమైన నాయకులు

సికింద్రాబాద్, ఆగస్టు 23: సికింద్రాబాద్ నియోజకవర్గంలో బీజేపీ సెప్టెంబర్ 1నుంచి తలపెట్టనున్న సభ్యత నమోదునను విజయవంతం చేయాలని మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి పిలుపునిచ్చారు. ఐదేండ్ల క్రితం నుంచి నియోజకవర్గంలో బీజేపీ బలోపేతమైందని చెప్పారు. ప్రతి ఇంటింటికి వెళ్లి సభ్యులుగా చేర్చుకోవాలని కోరారు. సభ్యత్వ నమోదు కన్వీనర్‌గా ఎన్నికైన కనకట్ల హరిని సన్మానించారు. సమావేశానికి నాగేశ్వర్‌రెడ్డి అధ్యక్షత వహించగా నాయకులు రవి ప్రసాద్‌గౌడ్, రాచమల్ల కృష్ణమూర్తి, శారద, పోచయ్య, దిలీప్, డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, హనుమంతు ముదిరాజ్, రాజేశ్‌నాయర్, సేతి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

పేదల సంక్షేమానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్‌కు చెందిన రజితకు వైద్యచికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి ద్వారా రూ. 2.30 లక్షల సాయం నిధుల మంజూరు పత్రంను ఆమె కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శుక్రవారం తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, కాశీనాథ్ యాదవ్, అశోక్ పాల్గొన్నారు.

- మియాపూర్

వస్త్రాలంకరణలో మహంకాళి అమ్మవారు

ఉజ్జయిని మహంకాళి అమ్మవారు

బేగంపేట్, ఆగస్టు 23: శ్రావణ శుక్రవారం సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయానికి భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా వస్త్రాలతో అలంకరించారు. ఈ క్రమంలో భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు ఆలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి తగిన ఏర్పాట్లు చేశారు. శ్రావణ మాసంలో అమ్మవారికి ప్రతి శుక్రవారం ఒక్కో అలంకరణ చేయనున్నట్లు తెలిపారు.

సెల్‌ఫోన్లు స్వాధీనం.. బాధితులకు అందజేత

కుత్బుల్లాపూర్, ఆగస్టు 23: మేడ్చల్‌జోన్ పరిధిలో సెల్‌ఫోన్లు చోరీకి గురైన కేసులో క్రైం విభాగం పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి 130 సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. శుక్రవారం పేట్ బషీరాబాద్‌లో డీసీపీ ఎన్.కోటిరెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు. మేడ్చల్ జోన్ క్రైం బృందం సెంట్రల్ ఎక్విప్‌మెట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌ను ఉపయోగించి 30 రోజుల్లో 130 సెల్‌ఫోన్లు రికవరీ చేయడంపై క్రైం మేడ్చల్ డీఐలు నర్సింహరాజు, జి.రాజేంద్రగౌడ్, కె.వెంకట్‌రెడ్డి, సతీశ్‌కుమార్, క్రైమ్ టీం చేసిన కృషిని అభినందించారు. సమావేశంలో మేడ్చల్ జోన్ డీసీపీ పరిధి సీఐలు, ఎస్సైలు, క్రైం విభాగం బృందం పాల్గొన్నారు.

పేట్ బషీరాబాద్‌లో బాధితులకు ఫోన్లు అందజేస్తున్న డీసీపీ ఎన్.కోటిరెడ్డి

ఫిట్‌గా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి



హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ ఎక్స్ పో ఇండియా 2024 కార్యక్రమానికి హాజరైన సినీ నటుడు, దర్శకుడు అవసరాల శ్రీనివాస్

మాదాపూర్, ఆగస్టు 23: ఫిట్‌గా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సినీ నటుడు, దర్శకుడు అవసరాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ ఎక్స్ పో ఇండియా 2024 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అవసరాల విచ్చేసి డెకాథ్లాన్ విశ్వరాజ్ మోహన్, ఎన్ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయపాల్‌రెడ్డి, హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ రాజేశ్ వెత్సా, బడ్డీ బస్ల్ ఆదిత్యారెడ్డి, హైటెక్స్ బిజినెస్ హెడ్ టి.జి. శ్రీకాంత్‌లతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా అవసరాల శ్రీనివాస్ మాట్లాడుతూ .. స్పోర్ట్స్ ఎక్స్ పోను సందర్శించడంతో నేను ఫిట్‌నెస్‌గా ఉండేందుకు ప్రేరణ పొందినట్లు తెలిపారు. కొవిడ్ తర్వాత మానేసిన వ్యాయామాన్ని తిరిగి ప్రారంభిస్తానన్నారు. శనివారం 7 గంటల సమయంలో 13 ఎడిషన్‌కు చెందిన 5 కే రన్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ భారతదేశంలోని మొట్టమొదటి సంస్థాగత రన్నింగ్ గ్రూప్ 24వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో న్యూట్రీషన్, వెల్‌నెస్ పరిశ్రమలలో విభిన్న విభాగాల నుంచి ప్రముఖ బ్రాండ్‌లను ప్రదర్శించారు.

పర్వత శిఖరాలు అధిరోహించిన యువకుడికి సన్మానం

తులసిరెడ్డిని శాలువాతో సన్మానించి అభినందిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

దుండిగల్, ఆగస్టు 23 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, బౌరంపేట్‌కు చెందిన యువకుడు పల్పునూరి తులసిరెడ్డి 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఐరోపాలోని 5642 మీటర్ల మౌంట్ ఎల్బర్స్ శిఖరాన్ని అధిరోహించి జాతీయ జెండాను ఎగురవేసిన విషయం విధితమే. తులసిరెడ్డి మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును శుక్రవారం కలిశారు. ఎమ్మెల్సీ తులసిరెడ్డిని శాలువాతో సన్మానించి అభినందించారు. తులసిరెడ్డి 2016లో గ్రాడ్యుయేషన్ అనంతరం మొదటి సారిగా 2022లో లడఖ్‌లో 3610 మీటర్ల స్టాక్ కాంగ్రీ పర్వతాన్ని అధిరోహించారు. 2023 లో కాశ్మీర్‌లోని 4190 మీటర్ల గగ్రేట్ లేక్స్‌ను,ఆఫ్రికా ఖండంలో 5859 మీటర్ల కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టుల గొంతుకగా మారుతా

ఎమ్మెల్సీ అమెర్ అలీఖాన్

రవీంద్రభారతి,ఆగస్టు 23 : పత్రికా సంపాదకుడిగా జర్నలిస్టుల కష్టసుఖాలపై తనకు ఎంతో అవగాహన ఉందని, చట్టసభలో వారి గొంతుకగా నిలబడతానని ఎమ్మెల్సీ సియాసత్ ఉర్దూ దినపత్రిక సంపాదకులు అమెర్ అలీఖాన్ భరోసా ఇచ్చారు.తెలంగాణ శాసన మండలి సభ్యులుగా ఇటీవల ఆయన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లోని టీయూడబ్ల్యుజే కార్యాలయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్టు (హెయూజే)ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొని పైవిధంగా మాట్లాడారు. కార్యక్రమంలో విరాహత్ అలీ, ప్రెస్‌కౌన్సిల్ ఇండియా మాజీ సభ్యులు ఎం.ఏ మాజీద్,యాదగిరి, హెచ్ యూజే అధ్యక్ష, కార్యదర్శులు శిగా శంకర్ గౌడ్, ఎ.రాజేష్,యూసఫ్‌బాబు, హమీద్ షౌకత్‌లతోపాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శన

కొండాపూర్, ఆగస్టు 23: చిత్రకారిణి ఆశ రాధిక మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 'స్వాన్ : మిస్టికల్ వింగ్స్ అండ్ ఎటర్నల్ టింకిల్స్' పేరిట ఏర్పాటు చేసిన సోలో పెయింటింగ్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమయింది. కార్యక్రమానికి ప్రముఖ కళాకారిణి ప్రొఫెసర్ కవిత డివౌస్కర్ ముఖ్య అతిథిగా హాజరై ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కే లక్ష్మీతో కలిసి ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన చిత్రాలను తిలకిస్తూ చిత్రకారిణి రాధికను అడిగి వాటి వివరాలను తెలుసుకున్నారు. ప్రదర్శన ఆగస్టు 26 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

గాల్లోకి డబ్బులు వెదజల్లిన యూట్యూబర్‌పై కేసు



అమీర్‌పేట, ఆగస్టు 23: రోడ్డుపై ట్రాఫిక్ న్యూసెన్స్‌కు కారణమైన యూ ట్యూబర్‌పై సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. బోరబండకు చెందిన హర్ష అలియాస్ మహదేవ్ (24) ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తుంటాడు. మరింత గుర్తింపు తెచ్చుకునేందుకు ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రధాన కూడళ్లలో గాల్లోకి డబ్బులు వెదజల్లుతూ వీడియోలు తీసి ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. ఈ వీడియోలు వైరల్‌గా మారాయి. అయితే, ఇటీవల కూకట్‌పల్లి మెట్రోస్టేషన్ సమీపంలో కూడా ఇదే విధంగా డబ్బులు వెదజల్లడంతో అక్కడ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ఆగస్టు 11న ఎర్రగడ్డ ఆదివారం అంగడిలో కిటకిటలాడుతున్న జనాల మధ్య నిలబడి ఇదే విధంగా డబ్బులు వెదజల్లడంతో ఈ మార్గంలో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. ఈ దృశ్యాలను కూడా అతడు ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో.. ఈ వీడియో కూడా వైరల్ అయ్యింది. ఈ ఘటనపై బాలానగర్ ట్రాఫిక్ పోలీసులు గురువారం సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. ఇందుకు కారకుడైన హర్షపై కేసు నమెదు చేసినట్టు సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.

ఫ్రెండ్లీ పోలీస్.. వాలీబాల్ టోర్నమెంట్

కొండాపూర్, ఆగస్టు 23: ఫ్రెండ్లీ పోలీస్ వాలీబాల్ టోర్నమెంట్ పేరిట మాదాపూర్ జోన్ పోలీస్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియంలో ఈనెల 29 నుంచి 31 వరకు పోటీలు జరగనున్నాయి. ఆసక్తిగల జట్లు పాల్గొనేందుకు 99660 61666 / 97018 59999లో సంప్రదించాని కోరారు. జాతీయ వాలీబాల్ పోటీల్లో ఆడిన వారు, పోలీసు శాఖకు చెందిన ఆటగాళ్లకు అనుమతి లేదు. విజేతకు రూ. 15వేల నగదు, రెండో, మూడో బహుమతులు వరుసగా రూ.10వేలు, రూ. 5వేలను అందజేయనట్లు ఓ ప్రకటనలో తెలిపారు.